# కలలూ-సంకెలలూ

## అవసరాల రామకృష్ణారావు

ఒక్క నిట్టూర్పుతో ముందుకి సాగి, బిచిరోడ్డున నడక ప్రారంభించింది శకుంతల. అలా రెండు ఫర్లాంగులు నడిచిందో లేదో, గింగురుమనే హారన్ తోపాటు సడెన్ బ్రేకుతో స్కూటరొకటి తనపక్కని ఆగడం జరిగింది.

స్కూటర్ మీది పురుషుడి వెనక స్త్రీ ఒక గెంతుగెంతి రెండుచేతులూ పట్టుకుని 'నువ్వటే శకూ' ! అనడం జవాబుగా ఈమె 'నువ్వా ఇందూ, ఇవాళ ఎంత అదృష్టం !' అనడం ఒక్కనిముషంలో జరిగిపోయాయి.

'ఇది శకుంతలఅని మా స్నేహితురాలండీ ! మీరు కాకినాడ పిల్లకి కాకినాడ ముద్దు— అంటూంటారే. అక్కడినరుకే నేమంతా ! నువ్వు మా వార్ని చూడనేలేదుకదు శకూ, అవును, మా పెళ్ళికి వచ్చే తీరికేది తమకి ? పేరు శ్రీధర్. ఉద్యోగం కాల్టెక్స్‌లో'

శకుంతల ఇందిర మాటల్ని సరిగా వింటు న్నట్టులేదు. మెర్క్యురీస్ట్రీట్ లైట్ క్రింద ధగాధగా మెరిసిపోయే స్కూటర్ ముందు ఆరోగ్యమూ, ఐశ్వర్యమూ పక్కపక్కని నిల బెట్టినట్టున్న ఆజంటని చూడగానే ఆమె కన్ను తిప్పుకోలేకపోయింది.

'ఏమిటి అలా ఎగాదిగా తెగచూస్తున్నావ్, ఏముంది మాలో ?' అని స్నేహితురాలితో అని—మొగుడివైపు తిరిగి అంది ఇందిర.

'మీరలా రామకృష్ణా బీచ్‌దాకా స్కూటర్ మీదవెళ్ళి కేంటిన్‌లో వెయిట్‌చేస్తూ ఉండండి. మేమిలా నడుచుకుంటూ వస్తాం'

'ఏం. నేనుకూడానడిచివస్తే మీ ఏకాంతాని కేమైనా అభ్యంతరంటండీ ?' అని శ్రీధర్ అనడం కొత్తదనంతోపాటు కాస్త వెగటుగా కూడా తోచినా — ఆ నడకలో ఠీవి, ఆ తల ఎగరేసి మాట్లాడ్డంలో దర్పా-వాటిని కాదన లేక ఆమోదముద్రగా చిన్ననవ్వు విసిరింది శకుంతల.

'నామటుకు నాకు అభ్యంతరమే' అంది ఇందిర. కాని ఆమాట వినీ విన్నట్టు శ్రీధర్ ఊరుకుని, వాళ్ళతో నడకసాగించాడు.

'అయితే యీ సాయంత్రపువేళ తను ఊరుగాని ఊరులో ఈగారి షికారుకు ఆంతర్యం ?' అంది ఓగడి ఊరుకుని ఇందిర. ఎలా మొదలెడితే బాగుంటుందా అని కాక ఏం చెబితే బాగుంటుందా అన్నట్టు ఆలోచిస్తూ, నడకసాగించింది శకుంతల.

'వినపడిందా నేనడిగిందీ ? తమరి భర్త గారికి తెనాలిలో కదూఉద్యోగం, ఉన్నట్టుండి ఇక్కడికెప్పుడు తరలి వచ్చావని ?'

'ఏం నీతో చెప్తేగాని యిక ఎవరూ ఎక్కడికీ రైలెక్కకూడదాయేం ?' అన్నభర్తని

'అబ్బే తమరు కలుగచేసుకుంటేగాని సంగతులు బయటపడవనీ !' అని అదమా యించి 'మాట్లాడవేమే ముంగీశ్వరీ !' అని స్నేహితురాల్ని మోచేత్తో పొడిచింది ఇందిర.

'చెప్తాను ఒకటీ ఒకటీ, అలా తొందర పడితే ఎలా ? మా రేవతిని ఇక్కడే కదూ యిచ్చారు, దాని దగ్గరికే వచ్చాము, రమ్మని చంపేస్తూంటె'


'ఏమిటే, మీ చెల్లికి పెళ్ళైపోయిందా ! ఎక్కడ అది పెళ్ళి కాకుండా ఉండిపోతుందో అని పాపం మీ అమ్మగారు ఎంత గోలపెట్టే వారో ! ఇక్కడే ఉందా తను ? మీ మరిదికి ఏం పనిటా ?

'రేవతి మొగుడు ఇక్కడే నేవీలో ఉన్నాడు. నెలకి పదిహేనువందల పైనే వస్తుందట.'

ఆ అంకె వినగానే శ్రీధర్ మొహంలో మార్పు కనిపెట్టి మరింత ఉత్సాహంతో చెప్పుకుపోయింది శకుంతల.

'వాళ్ళ క్వార్టర్స్ ఎంత బాగున్నాయను కున్నావ్ ఇందూ ! ఫుల్ ఎయిర్‌కన్డిషన్డు. ఓ చీమగాని దోమగాని వెతికినా కనపడదనుకో'

'ఇంట్లో ఓ చీమగాని దోమగాని కనప డితే వచ్చిన పెద్దనష్టమేమిటి గాని వాళ్ళి



## కలలూ — సంకెలలూ



హనీమూన్‌కి తిరపతి వెళ్తాం అని
మెట్టుకు మొక్కుకోకు డియర్ !
అక్కడనుండి గుండుతో తిరగాలి నేను
నీవెనక !

ద్దామూ సరదాగా కలివిడిగా ఉంటారా ఉండరా. ముందది చెప్పు.' అన్న ఇందిర మాటలకి నవ్వి—

'అయితే వాళ్ల కబుర్లేగాని మా కబుర్లు అక్కర్లేదన్నమాట !' అంది శకుంతల.

'అవునవును, అలా అడగండి' అని అందించాడు శ్రీధర్.

'ఏదీ నీ నోటవెంట ఓ పట్టాన ఊడి పడందే !'

'ఏదో మా మరిది హోదాకయితె అందుకో లేకపోవచ్చుగాని ఈమధ్య మా పనీ మెరుగ్గానే ఉందే ఇందూ ... ఎదుగూ పొదుగూ లేని ఆయనగారి ఉద్యోగానికి అహోరాత్రాలు పోరాడి తిలోదకాలు యిప్పించాను. రెండేళ్ళైందనుకుంటాను, అక్కడే ఫేన్సీ షాపు పెట్టేరు. మొదట్లో కొంచెం భయపడ్డాంగాని ఏడాదైనా నిలదొక్కుకుంది. నిలదొక్కుకోడమేమిటిలే, నీతో చెప్పకేం, లాభాలు బాగానేఉన్నాయి. మరి నా బంగారం అంతా కొట్టుమీద పెట్టెయ్యబట్టే గదా యిలా బోసిమెడతో మిగిలాను! ఇక్కడే షాపులో మంచి రకాలు దొరుకుతాయని చెక్కేచ్చి పంపేరు ఆయన. నేనిలా పిల్లల్ని యింట్లో వదిలి అప్పటికప్పుడు బయల్దేరి రాడానికి యిదికూడా ఓ కారణం అనుకో'

'ఎన్ని రూపాయల కిచ్చారండీ చెక్కు ?' అడిగాడు శ్రీధర్ ఆతృతగా ...'

'ఏదో యిచ్చారుగాని, పదివేలకి యిప్పుడేమంత బంగారం వస్తుంది గనక !' అని చప్పరించింది శకుంతల.

'పోన్లే మొదట్లో చికాకులుపడ్డా మీవాళ్ళు యిప్పటికేనా ఎత్తిరిల్లారన్నమాట. పాపం ఈ ముసలి కాలంలో మీ అమ్మగారికీ నాన్నగారికీ కొంత మనశ్శాంతి' అంది ఇందిర.

ఓ అరగంట బీచిలో కూచుని అవీ యివీ చెప్పుకుని వాళ్లు ముగ్గురూ కేంటీన్ చేరుకున్నారు. శ్రీధర్ ఐస్‌క్రీమ్ ఇప్పించాడు.

'పదమూడో నెంబరు బస్సు ఎక్కి ద్వారకానగర్ స్టాప్ దగ్గిర దిగిపోండి. అక్కడికి స్టేట్‌బ్యాంక్ దగ్గిరే. ఎవర్నడిగినా చెబుతారు. దానికి రెండిళ్లవతల ఉన్న పోకచెట్లయింట్లో మేడమీద వాటామాది. ఇంకా ఉంటారుగా, ఎప్పుడేనా రండి, అని ఆహ్వానించాడు శ్రీధర్.

'ఎప్పుడో ఏమిటి, సంసారాన్ని ఒదిలి వచ్చింది,ఏక్షణాన్న వైరొచ్చినా అది రైలెక్కవలసిందే... రేప్పొద్దుటే వచ్చెయ్యవే శకూ... అన్నట్టు మీ రేవతిని కూడా తీసుకు రావే... ఎన్నాళ్ళైందో మనం ముగ్గురం మళ్లీ కలుసుకుని !'

ఏం చెప్పి తప్పించుకుందామా అని శకుంతల కంగారు పడుతూండగా శ్రీధర్ ఆమెకా బాధలేకుండా చేశాడు.

'ఏం మనిషండీ బాబూ మీ ఫ్రెండు, అప్పుడు మీ రెలా వేగేవారో గాని ఇంత మందమతితో గడుపుకు రాడం నా దుంప తెగుతోందనుకోండి'

శకుంతల 'ఏం?' అన్నట్టూ ఇందిర 'ఏం ఎలా ఉందేం!' అన్నట్టు ఒకేసారి శ్రీధర్ వైపు చూశారు. అతని జవాబు ఇదీ:

'ఆదివారం రాత్రి మా స్నేహితుడి చెల్లెలికి సింహాచలం కొండ మీద పెళ్లండీ. రేపు మాకు హాఫ్‌డే కదా... ఆఫీసునుంచి వస్తూనే ఏ నాలుగ్గంటలకో స్కూటర్ మీద వెళ్లిపోతున్నాము. తిరిగి సోమవారం రాత్రికి వాడు వదుల్తే అదే గొప్ప. మీరు మంగళవారం దాకా ఉండలేరూ?'

'ఎందుకు ఉండలేదూ ? ఉండలేనని మీతో చెప్పిందా ఏం ? వచ్చి వారం రోజులు తిన్నవేసిగాని వెళ్లకే శకూ' అంది ఇందిర.

'ఈ సారి వచ్చినప్పుడు అలాగే... ఇప్పటికి మాత్రం నన్ను వదిలెయ్యి... ఎల్లుండి మెయిలుకి అప్పుడే నాకు బెర్త్ రిజర్వ్ అయిపోయింది'ఉన్నట్టుండి ఇందిర లేచినిలబడింది.

'ఇప్పుడే వస్తాం. మరోలా అనుకోకు... చిన్న కబురుంది'అని మొగుడు చెయ్యి పట్టుకుని దూరంగా తీసికెళిపోతున్న ఇందిర్ని చూసి నిర్ఘాంత పోయింది శకుంతల.

అనుకున్నంత తొందరగా రాలేదు వాళ్ళు. ఏదో ఘర్షణ పడినట్టు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. లేని నవ్వు తెచ్చి పెట్టుకుని శ్రీధర్ అన్నాడు:

'దీనొత్త మీ చిన్నప్పుడు ఎలా పడేవారో ఏమిటో... ఈ చిన్నవిషయానికి వేరే తీసుకెళ్లాలా ? మీరు కాబట్టి సరిపోయింది కాని యింకోరయితే ఏమనుకుంటారు ! మా ఫ్రెండు చెల్లెలికి ఏమిస్తే బాగుంటుందని... వెండి గంధపు గిన్నె యిస్తే బాగుంటుందని... నేనూ, అలా కాదు చీర పెడదామని తనూ... ఆఖరికి తన మాటే నెగ్గించుకుందనుకోండి, ఆడాళ్లకి లోబడిపోయాక తప్పుతుందా మరి ! ఈఊళ్ళో తొందరగా షాపులుమూసేస్తారు— పైగా యీ పవర్‌కట్ ఒకటీ, చస్తున్నాం! చెప్పాలంటే అసలు మేం బయలు దేరిందే అందుకు...అన్నట్టు మీరొక్కరూ ఎలా వెడతారు అంతదూరం?'

'బాగుంది ! నన్నిక్కడ డ్రాప్ చేసి కదా అతను మార్కెట్‌కి వెళ్లింది. ఇంక అరగంటలోగా మా మరిది కారులో రాడూ ?'

'అయితే బాధ లేదులెండి. మరి మేం వెడతాము. మీరు ఎలాగైనా రెండు రోజులు మా యింట్లో గడిపి మరీ వెళ్లమని మా కోరిక. మీరేమో కుదరదు పొమ్మంటున్నారు. అలా అంటే ఎలా ? ఆలోచించండి.'

మొగుడి వెనకే స్కూటర్‌ఎక్కి కూచుంది. ఇందిర. వాళ్లు కనుచూపుమేర దాటిపోయాక నర్సింగ్‌హోమ్ వైపు నడక సాగించింది శకుంతల. ఆలోచించిచూస్తే ఎప్పట్లా ఉన్న ఇందిర చిలిపితనం, పెంకితనం కాక ఇంకేదో అతి బలమైనది — వాళ్లిద్దర్నీ ఆవ

### నిజాయితీ

అమెరికాలోని హనోవర్‌లో ఒకావిడ ఒక పుస్తకాన్ని యీ మధ్యనే లైబ్రరీకి తిరిగి యిచ్చివేసిందట. ఈ పుస్తకాన్ని ఈవిడ బంధువు ఒకరు 1907లో లైబ్రరీ నుంచి తీసుకున్నాట్ట. ఆయన మరణానంతరం యీ పుస్తకం బయటపడిందట. ఈ పుస్తకంలో 106 పేజీలు ఉన్నాయట. "ఒక్కొక్క పేజీ 231 రోజులపాటు చదివినా ఇన్నేళ్ళు పట్టదు" అని లైబ్రేరియన్ వ్యాఖ్యానించాట్ట !

# కలలూ — సంకెలలూ

రించి ఉన్నది — తనని తీవ్రంగా అటువైపు ఆకర్షిస్తోంది. పైపై చూపులకే యింతగా భోగభాగ్యాలతో తులతూగుతున్నారే, యిక వీళ్ళన్న యిల్లు ఎలా వుంటుందో! ఆ కోరిక అధిగమించలేక ఎలాగో వీలు చూసుకుని మర్నాడు మధ్యాహ్నానికి శ్రీధర్ ఇంటికి వెళ్ళింది శకుంతల.

'మీరా, రండి, రండి! ఇల్లు సులువుగా తెలిసిందా?' అంటూ ఆహ్వానించాడు అతను.

'ఎలాగా రేపు వెళ్ళిపోతాను. మళ్ళీ ఎన్నాళ్ళకో... నిన్న మా ఇందుతో ఏమీ గడిపినట్టే అవలేదు. మరోసారి చూడందే ఉండబట్టలేదు నా ప్రాణానికి. మీరు నాలుగికిగాని బయల్దేరమన్నారుగా!'

'పోన్లెండి మంచి పని చేశారు. తనూ గోలపెడుతూనే ఉంది. తీరా ప్రాణ స్నేహితుడు, మాట ఇచ్చాం, ఎలా కాదనడం చెప్పండి?'

'మీరు ప్రయాణపు హడావిడిలో ఉన్నారో ఏమిటో!'

'ఫరవాలేదులెండి. మరేం దూరంకాదుగా, ఓ సూట్‌కేస్ తీసికెడితే సరిపోతుంది.'

'ఇందు ఏదీ?'

'అదా? ఇంట్లో లేదండీ!'

'ఎక్కడకెళ్ళిందీ?'

'చెప్తాను... వినండి మరి...' అంటూ తేనీరు తెచ్చిపెట్టుకుని శ్రీధర్ ఆరంభించాడు.

'ఏమిటో ఇంతదూరం మీారు అభిమానపడి వచ్చినందుకు అది లేకపోడం... ఏదో శాపంలా ఉంది... రాత్రి పట్టుపట్టి ఆ చీర తెచ్చిందా. విప్పి చూసేసరికి అక్కడక్కడ యింతింత తూట్లు. ఆ షాపువాడి మొహాన్ని కొడదామని యిప్పుడే వెళ్ళింది. మరోటి తీసుకుని అక్కడే ఉంటుంది. నేను యిల్లు తాళం వేసుకుని స్కూటర్‌మీద బయలుదేరి దాన్ని షాపులో పికప్ చేస్తాను. అయ్యో లేచి పోయేరేం, కూర్చోండి. ఫ్లాస్కులో కాఫీ ఉంది, ఇస్తానుండండి. అంత మొహమాటమయితే ఎలా? మీ ఫ్రెండేగాని ఫ్రెండు యిల్లు ఓమారు చూడరాదా యేం?'

నిజానికి శకుంతల వచ్చింది ఆ ముచ్చట తీర్చుకుందామనే. ఆ మేడమీది మూడు గదులూ చూడగానే అందులో సామానుల వివరణ అతను చెప్పింది వినగానే — యింకా మతి అనేది ఏమైనాఉంటే అది కాస్తా ఊడి పోయినట్టయింది.

మరో పావుగంటకి ఆ యిల్లు దాటి, ఆ వీధి మలుపుతిరిగి, వంద గజాలు సిటీబస్ స్టాప్‌వైపు నడిచింది శకుంతల.

ఎవరో చప్పట్లుకొట్టి తన పేరుపెట్టి పిలిచినట్టై వెనక్కుతిరిగి చూసింది. దూరంగా ఇందిర! పక్కని సంచీనిండా కూరలు పట్టుకుని ఓ కుర్రాడు! వాడికేదో చెప్పి అలాగేపంపేసి ఇంచుమించు పరిగెత్తుకు వచ్చి శకుంతల రెండుచేతులూ పట్టుకుంది ఇందిర.

'చిన్నప్పుడు అమ్మ వద్దని ముందుగా చెప్పినా సినిమాకి చెక్కేసేదాన్ని. తిరిగివచ్చాక వీపు బద్దలైపోయేదనుకో ... నాలుగుదెబ్బలు తింటే ఏంనష్టం, సినిమాచూసిన ఆనందాన్ని అమ్మ వెనక్కి తీసేసుకోలేదుగదా! ఇవాళా అలాగే చేయదల్చుకున్నాను, నేను ఇంత తొందర్లో ముసల్దాన్నయిపోడం నాకే కష్టంగా ఉంది... పద పద'

తెల్లబోయి చూస్తున్న శకుంతల్ని చెయ్యి పట్టుకు లాగినంత పనిచేస్తూ మళ్ళీ అంది ఇందిర ...

'పద...పద...ఇంకా చూస్తావేం? సిటీ బస్సు అందుకుని ఎల్లమ్మతోట జంక్షన్లోదిగిపోయి సింధియావైపు వెళ్ళే మరో బస్సు ఏదందుకున్నా నేవల్‌బేస్ చేరుస్తుంది. ఈ రాత్రికి నీతోపాటు నేనూ రేవతిఇంట్లోనే...'


శకుంతల ఏదో చెప్పబోతే నోరెత్తనివ్వలేదు.

'మొగుడిలో ఫ్రెండ్‌ని చూద్దామని యిన్నాళ్ళూ ఎంతో ట్రై చేసి ఫెయిలయ్యాను నేను. ఆఖరికి ఎన్నాళ్ళకో దొరికిన ఫ్రెండ్‌వి కదా అని నిన్నుచూసి ముచ్చట పడదామనుకుంటే నువ్వుకూడా మొగుడిలాతయారయ్యావేమిటే శకూ!'

ఇద్దరూ బస్‌స్టాప్ చేరుకున్నారు. ఆఎండవేళ అక్కడ వాళ్ళిద్దరూ తప్ప మరెవ్వరూ లేరు. ఉన్నా ఇందిర లక్ష్యపెట్టేది కాదేమో!

'నిన్నసాయంకాలం నిన్నుచూసీ చూడగానే నామనసు తిన్నగా ఎక్కడికి వెళ్ళిపోయిందో తెలుసా! మన కాకినాడకి. ఇంచుమించు ఒకేయీడు వాళ్లమైన నువ్వూ నేనూ రేవతీ— అక్కడ ఎన్నెన్ని ఆటలు ఆడుకునే వాళ్లమో— పదేళ్ళు అయిపోతే యేంగాక, నిన్నా మొన్నా జరిగినట్టుంది నాకు. అన్నిటికన్న మనం మనసుపడి ఆడుకునే పందు గొకటి ఉంది గుర్తుందికదూ! ఆడపిల్లల కలల తేనియ, అట్లతదియ! ముందురోజు నుంచే ఎన్ని ఏర్పాట్లు. ఎంతహడావిడి! పదిమందిసిపాయిల పాడుపుకథ నీకు గుర్తుందీ? రాత్రిపూట ఆకుపచ్చ టోపీలలో బంధింపబడి పడుకుంటారు, తెల్లారీ సరికి పోలీసులుగా మారి పోతారు! జ్ఞాపకం వచ్చిందా? ఇంతకీ ఒక్కవేళ్లకేనా ఆ గోరింటాకు ముస్తాబు! అరచేతి నిండా గుండ్రంగా చీపురుపుల్లలతో చుక్కలు. మధ్య అమర్చిన గుండ్రని చందమామకి కానుకగా, మచ్చగా, లోపల ఓ బంతి ఆకు,

(31 వ పేజీ చూడండి)



గోరింటాకు పండేదాకా వ్యవధి ఏది, తెల్లారీ దాకా వ్యవధానమేది ! ఎంత చీకటితో లేపినా ఆలశ్యం చేసేశారని యింటిల్లిపాది మీదా ఊరంత అలక. అదరా బాదరా కాలకృత్యాలు తీర్చేసుకుని కడుపునిండా చద్దెన్నం కొట్టెయ్యడం. ఇక అన్ని వీధులూ మనవే. ఇక వయసులోఉన్న పిల్లల్ని చూసి వెర్రెత్తిన ఆ వెన్నెలలో మన ఆటలే ఆటలు. ఒక రకమా, ఓ లోకమా! నీకు జ్ఞాపకముందీ, అ రోజుల్లో, రామారావుపేట వీధుల్లో మనం ఆడుకుంటూంటే, వాళ్లని కూడా ఆటలో చేర్చుకోలేదని మన వయసు మగపిల్లలు చేసే అల్లరీ! కొళాయి చెరువు తోటలోంచి పల్లేరుకాయలు ఏరితెచ్చి మనం ఆడుకునే అన్ని దారుల్లోనూ జల్లేవారు. అప్పుడేకాదు, ఎప్పుడూ పరుస్తూనే ఉన్నారు. ఆడదాని జీవితంలో మొగాళ్లు, ముళ్లు !

ఏమిటో అన్నిరకాల పండుగలు వస్తాయి వెడతాయి. కాని దేనికీ కన్నెమనసుతో యింత దగ్గరతనం నాకు కనపడలేదే శకూ! ఉయ్యాలలూగి, ఉపవాసముండి, ఆ తదియ రాత్రి, ఆ చంద్రుడి కోసం అలా అలా చూస్తూ కూచోడం ఎంత కష్టం! ఆడదాని బతుకులోని నిత్య నిరీక్షణకి అదే మొదలేమో! కలువరేకు కళ్లతో చూడగా చూడగా దర్శనంగా దయచేస్తాడు ఆ చలపరాతి దేవుడు ! వారికి పూజ చేసి అట్లు నైవేద్యం పెడితేగాని కన్నె పిల్లల కడుపు నిండదు, కలలు పండవు ! నిన్ను చూడ్డంతోపాటు రేపే అట్లతదియ అని గుర్తు రాగానే ఆ పాత వాసనలన్నీ మరొకసారి మత్తెక్కించాయ్ శకూ! అందులో కలుపుకోడానికి గోంగూర పచ్చడి, ఉల్లిపాయ పులుసే కాదు, అసలు చద్దెన్నమే లేక పోవచ్చు. నంజుకుని తినడానికి తియ తియ్యని చెరుకు పాకమే కాదు, పుల పుల్లని అల్లో దొరక్కపోవచ్చు. కాని మనం ముగ్గురం ఉన్నాం. మన కళ్లల్లో యింకా తడి ఉంది. మన గుండెల్లో యింకా సందడి ఉంది. రేపు తెల్లారుఝామున లేచి ఆ వెన్నెల్లో ఆరు బయట ఒకరి కళ్లల్లోకి ఒకరు చూస్తూ కూచుందాం. ఇక నన్ను వాగించకు, అడ్డు చెప్పకు, ఆలశ్యం చెయ్యకు. ఓ సిటీబస్సు అందకపోతే దాని బాబు మరోటి, పద మీ రేవతి దగ్గిరకి ఎగిరిపోదాం.'

'బాగుందే, మీరు పెళ్లికి వెళ్లరూ, ఇక్కడిలా కబుర్లు చెబుతూ కూచుంటే

## కలలూ — సంకెలలూ

(18వ పేజీ తరువాయి)

అక్కడ మీకు వేళయిపోడంలేదూ ?

'ఇంతసేపూ నేను గొంతుకు చించుకున్నందుకు యిదా నీ కబురు ! భేష్ ! సెలయేరులా ఉండేదానివి చింత మొద్దులా తయారయావేమిటే తల్లీ ! నిన్న నీ నోట మా మరిది భోగ భాగ్యాలు విని మా వారికి మతి పోయిందనీ, యీ పెళ్లి వ్యవహారం అంతా నువ్వు మా యింటికి రాకుండా అల్లిన కట్టు కథ అనీ యింకా బోధపడలేదా నీకు ! ఆయనకి తప్పింది గాని నాకు తప్పుతుందా నీతో ! పద, పద. నిన్ను చాలా అడగాలి.'

'అదికాదే!'

'మరి ఏది అవునూ ! ఇంత నాస్తుడు ఎప్పుడు ప్రవేశించింది నీలో ?'

'నీకూ నాకూ కుదిరితే మా చెల్లికి కుదిరి చావొద్దూ ? ఇంత ఉత్సాహమూ యిలా నీరు కారిపోడం నేను భరించలేకుండా ఉన్నాను. కాని ఏం చేయను ! మా రేవతి అవస్థ అనుకోకుండా అలా అయింది.'

'ఏం ఉన్నట్టుండి ఏం పట్టుకొచ్చిందీ, నీకా, మీ రేవతికా ?'

'దాని ఆడపడుచుకి పురుడొచ్చిందని కబురొచ్చి, అది మధ్యాహ్నమే తుని బస్సు ఎక్కేసింది !'

'సె-హ-భా-ష్!' అని పకపక నవ్వుతూ అంది ఇందిర.

'ఇక మనకి మిగిలింది ఒకటే; శంకర మఠం ! ఏం అలా తెల్లబోతావ్, నీకేకాదు. ఎన్ని మొట్టికాయలు తిన్నా యింకా అక్కడికి చేరేలా నాకూ గుండె గట్టిపడలేదు. ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో నిజంగానే ఉంది శంకరమఠం అని. ఎప్పటికైనా అందరూ చేరకపోతారా అని కాబోలు విశాలంగానే కట్టించారు. దీపాలు పెట్టేవేళకి కిటకిటలాడుతూ కళకళ లాడుతూ ఉంటుంది గాని యీ వేళకి బిక్కు బిక్కుమంటూ ఉంటుంది. పద దాన్ని కాసేపు అలంకరిద్దాం.'

దార్లో కిళ్లీషాపులో కూల్‌డ్రింక్స్ తాగి అక్కడికి చేరుకున్నారు వాళ్లిద్దరూ. ఆ ప్రశాంతతా ఏకాంతమూ చూసి శకుంతల ముచ్చట పడింది.

'ఇప్పుడు చెప్పవే... ఎప్పుడో పెళ్లినాడు చూశాను మా శ్రీవారిని. అప్పుడే ఓ జీవితం అనుభవం అయిపోయిందాన్లా కనిపిస్తున్నావు ఎలా చూస్తాడు మా ఆయన నిన్ను ? ఎక్కడేం చెప్పేసుకుంటారో అని ఆడాళ్ల వెంట పడడుగా మావారిలా ? నిముటుకు నిన్ను బతకనిస్తాడుగద !'

ఇందిర్ని చూసి, శ్రీధర్ మీద ఆ విసుర్లు వింటున్నకొద్దీ శకుంతలకి అరికాలిమంట నెత్తికెక్కుతోంది. దీని పుట్టింటారి సిరి సంపదలు ఎవరెరగరని ! తన పెళ్లయిన ఏ ఆరేడేళ్లకో చచ్చిచెడీ అయింది. అఖరికి రెండో పెళ్లి వాడికైనా యిచ్చేద్దామని వాళ్లమ్మ సిద్ధపడింది. ఎవడికి తెలియని



భాగోతం! ఎప్పుడు ఏ నక్కవి తొక్కిందో నవమన్మధుణ్ణి చేపట్టింది. ఏం పోయే కాలమా! ఆశకి అంతుండొద్దూ, దీని దరిద్రగొట్టు బతుక్కి ఏం తక్కువొచ్చిందని! నిన్న వాళ్లిద్దర్నీ అలా చూస్తేనే మతి పోయింది. ఇలాంటి వాళ్ల యిల్లెలా ఉంటుందో అని వాళ్ళు ప్రయాణం పెట్టుకున్నారని తెలిసినా ఓసారి కళ్లతో వచ్చి చూస్తేగాని ఉండలేక పోయింది. నిజానికి అది యిల్లా యింద్రభవనంగాని! వంట గదిలో గ్యాస్‌స్టవ్వూ, కుక్కరూ, గ్రైండరూ... డ్రాయింగ్‌రూంలో సోఫాలూ, కుర్చీలూ, ట్రాన్సిస్టరూ... పడకగదిలో డన్‌లప్ పరుపులు గల డబుల్‌కాటూ ... ఎక్కడికక్కడ కొళాయిలూ సీలింగ్ ఫేన్లూ... అన్నీ చూపించి 'ఇంకా టేప్ రికార్డరూ, గాడ్రెజ్ సేఫూ, ఫ్రిజిడెయరూ కొనలేకపోయాననండీ... అవిలేని యిబ్బంది రోజూ పడుతున్నాం...ఇంకో ఏడాదికి ఎలాగా అమరుస్తాననుకోండి' అనే అతని కబుర్లూ...ఆధునిక సంసారంలో ఏవేం కావలసి ఉంటుందో అతనికన్న తెలిసిన వాళ్లెవరని! ఇవన్నీ వీళ్ళు అమరుుకున్నది ఎన్నేళ్లలో? మూడేళ్ళయిందో లేదో! తన మొగుడూ ఉన్నాడు, పదేళ్లయింది పెళ్లై తనకి సిద్ధింపజేసినవి ఏమిటి! తలుచుకోడానికి కూడా సిగ్గుపడిపోయింది శకుంతల.


'ఏమిటో అనేం అనుకుంటాం శకూ... ఏమీ జరగదు...ఎలాగో యీడుస్తాం బతుకులు...ఉన్నపాటున ఉరెట్టుకోలేం కదా! ఏమంటావ్ మాటాడవేం మట్టి బుక్కడం లాగ?'

ఈ సారి శకుంతల ఊరుకోలేక పోయింది. మట్టిబుక్కడం మహా సర్పమై తిరగబడింది. పోనీ పోనీ కదా అని ఇంతసేపూ దిగమింగిన విషమంతా తిప్పితిప్పి కొట్టింది. మూల మూల బూజులన్నీ దులిపేసింది. పామి పామి కడిగేసింది.

'ఇంకా ఏం చాలలేదనే నీకా ఏడుపు! నీకున్న స్వతంత్రం సౌభాగ్యం ఏ ఆడదానికుందే?' అని నిలదీసింది.

'డబ్బు అనేది సుఖానికి కలికితురాయి కావచ్చు, గీటురాయి మాత్రం కాదు. ఎంత మాత్రం కాదు, శకూ! నీలో చూపుమాత్రమే మిగిలింది, పరిశీలన మాత్రం ఎక్కడికో పారిపోయింది— నీతో ఎలా చెప్పడమో బోధ పడ్డంలేదు' అంటూ అతి నెమ్మదిగా ఆరంభించింది ఇందిర.

'ఎన్నాళ్లకీ నాకు పెళ్లయూ గీత కనపడలేదని— మా నాన్నగారు ఉన్నదంతా ఊడ్చిపెట్టి పదివేలిచ్చి నాకు పెళ్లి చేశారని వినే ఉంటావు. మా మావగారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. మావారి ఎమ్మెస్సీ పూర్తి అయేసరికే ఆయన చతికిలబడ్డారు. తమగోతిలోకి దిగిపోయినా సాటి సంసారిని కొంతవరకైనా లేవనెత్తుదామని నాన్నగారు శక్తికి మించిన ప్రయత్నంచేశారు. కాని మా వారు తన తండ్రిని ఆడబ్బులో వేలు పెట్టనివ్వలేదు. రొక్కం అయితే అడుగుతారని అప్పటికప్పుడే అన్నీ కొనేశారు. ఇవన్నీ మొదట్లో తెలియలేదు నాకు. ఈ యాంత్రిక జీవనం చక్రాల చప్పుడులో అయినవాళ్ల ఆక్రందన నాకూ వినపడలేదు అప్పట్లో... ఈయన వెనక ముగ్గురు ఆడపిల్లలూ యిద్దరు మొగపిల్లలూ...తండ్రి ఎన్ని ఉత్తరాలు రాసినా 'నా కనీసవసరాలు తీరనివ్వండి' అని యీయన జవాబు! 'అలాగే, మేమందరం కట్టకట్టుకు చచ్చేక'అని ముసిలాయన రాసి ఊరుకున్నారు. నెలకి పాతిక రూపాయలైనా పంపమని కన్నతల్లి వచ్చి కన్నీళ్లతో అడిగితే కాణీ మిగలడం లేదు పొమ్మన్నారు. 'నెలకి ఏభై రూపాయిల రికరింగ్ డిపాజిట్ కడుతున్నాం కదండీ' అని నేను అడిగినందుకు ఆవిడా యిలా గుమ్మం



ఇది నీ ఏడుపా! చంపేశావ్! మా ఫాక్టరీ సైరన్ మోత కాబోలనుకుని డ్యూటీకి బయలుదేరాను!

దిగగానే నా చెంప ఛెళ్లుమంది! ఇక అత్తవారిపట్ల మా వారి ఆదరణ వేరే చెప్పాలా! ఏ పండుగకి పిల్చినా రైలు ఖర్చులు కాక కనీసం టెర్లిన్ సూట్ పెట్టితీరాలి. మావాళ్ళకి యీయనొక్కరే అల్లుడు కాదుకదా! పోనీ యీయన యింత గణిస్తున్నారు కదా తెలీకుండా ఏమైనా కూడబెట్టి పుట్టింటికి తరలిద్దామూ అంటే పైస పైసకీ పద్దు! ఇందాక నువ్వు చూశావ్ గదా వాడు కాక మరో ఆడమనిషి ఇరవైనాలుగ్గంటలూ నామీద కాపలా! కాని నా ప్రయత్నం నేను మావలేదు సుమా! ముందు నేర్చుకుని, క్రమంగా నేనూ టీచరుగా గణిస్తానని, ఆయన్ని మోసబుచ్చి కుట్టు స్కూల్లో చేరేను. నేర్చుకోడానికి ఆ గుడ్డలే యింటికి తీసుకొస్తున్నానని అందర్నీ నమ్మించి, ఎదురింట్లో మిషనుంటే అక్కడ జాకట్లూ అవీ కుట్టడమే కాదు, పాపం ఆవిడ సాయంతోనే కుట్టుకూలి రాబట్టేదాన్ని ... నువ్వు నమ్మవ్...ఆర్నెల్లు వేళ్లూ కాళ్లూ ముక్కలు చేసుకుని ఓ రెండొందలు పోగుచేసి, పెద్ద పండుగ ముందు మా నాన్నకి చేరేశాను తెలుసా! ఇదిగో ఇదీ నా యింట్లో నా స్వేచ్ఛ ... ఇదే నేను అనుభవించే సంపద!'

ఒక్క నిమషం ఊరుకుని మళ్లీ అంది.

'ఇన్ని చెబుతున్న దాన్ని నే నెందుకింకా తిరగబడలేదో నాకే ఆశ్చర్యం ... చచ్చీ చెడీ నా భారం ఒదుల్చుకున్నారు నాన్నగారు. మళ్లీ అక్కడికే వెళ్లనా! ఓ డిగ్రీ అయినా లేదు... వీధినపడిన ఆడదాన్ని సంఘం ఎంతటి సానుభూతితో ఆదరిస్తుందో వింటున్నాం. చూస్తున్నాం...సర్దుకుపోడంతప్ప గత్యంతరం లేదనే చచ్చు సంస్కారం పుట్టి పెరిగేను. ఎలా, ఎలా తెగించను! అలా కాదని ఎన్నాళ్ళు, ఎన్నాళ్లని భరించను! వేయి నాలికల అగ్నివేదిక గాని కేవలం పిడికెడు పేలిక కాదే యీ గుండె! అంతే కాదు...'

అలా ఎక్కడిదాకా వెళ్ళునో దూరం నుంచి వస్తున్న పని కుర్రాణ్ణి చూడగానే చటుక్కున లేచి నిలబడింది ఇందిర.

'అదిగో ఎలా తెలిసిందో ఆ వెధవ ఖుఫే వస్తున్నాడు. ఇక నే వెడతాను. నీ గురించి ఎన్నైనా వినాలనుకున్నాను — నీ వ్యవహారం ఏమిటో అడ్డదిడ్డంగా ఉంది అంతా...సరేలే ...మా యింటి ఎ్రడసు సరిగాచెప్పి రేవతిని పంపించు ఓసారి. అన్నట్టు ఊళ్లో లేదన్నా

ప్గా, పోనీ విూ మరిదికి చెప్పు. నీ పిల్లల గురించి అడగడమే మర్చిపోయాను. అంతా బాగున్నారుగా! ఈసారి యిలాకాక ఓ పది రోజులు ఉండేలా రా ఇంకా బాగా గడుపుదాం... వస్తా.'

గబగబ వెళ్లిపోతున్న ఇందిర్ని చూస్తూ అలాగే ఉండిపోయింది శకుంతల. ఇంటికి చేరేదాకా అలా ఆలోచిస్తూనే ఉంది.

'ఏమని చెప్పగలదు రేవతి గురించి, ఎన్నేళ్లయినా కన్యగానే ఇంట్లో పడుందనే కటిక నిజమా! తన గురించి ఏం చెబుతుంది, పిల్లల్ని యింటిదగ్గర అట్టే పెట్టి, వైద్యం నిమిత్తం మొగుణ్ణి విశాఖపట్నం తీసుకొచ్చిందనే కఠోరసత్యమా!

తన బతుకు తనకే హేళనగా తోచింది. ది గ్భ్రమ కలిగించే ఆ జంటముందు దిష్టిబొమ్మలాంటి తన బతుకుని బయటపెట్టుకోలేక ఏవేవో లేనిపోనివి కల్పించి చెప్పింది. ఒక అబద్ధం నిలబెట్టడానికి అలా అలా ఎన్నో కల్పనలు చెయ్యవలసి వచ్చింది.

అంతకుముందు తన బతుకేదో ప్రెసిడెంటు పెళ్లాంలా వెలిగిపోయిందని కాదు, యింతగా అప్పుల పాలై దినదినగండంగా దిగజారిపోయి మాత్రం లేదు! అదిగో ఆరు నెలల నాడు తన భర్తకు జరిగిన ప్రమాదంతో అన్ని అవస్థలూ ఆరంభమయ్యాయి. ఆ సైకిల్ యాక్సిడెంట్‌లో ఆయన కుడికాలి ముడుకు దగ్గిర ఫ్రేక్చరయింది. ఎన్ని నెలలు గడవనియ్యి. ఎన్ని వందలు తగలెయ్యనియ్యి... ఆ వాపు తియ్యదు. ఆ బాధ తగ్గదు. అక్కడ సరిగ్గా అతుక్కోడమంటూ జరగదు. ఎంతో ఆశతో యీ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కి వస్తే యీ ఆర్థోపెడిక్ సర్జన్‌గారు వందలకి వందలే మేసి, ఎక్స్‌రేలు తెగతీసి 'మొదట్లో సరిగ్గా వైద్యం జరిగింది కాదు. ఇన్ని నెలలు గడిచేక మళ్లా యధాస్థితికి వచ్చే అవకాశాలు తక్కువేమరి!' అని శలవిస్తున్నారు!

డబ్బున్నవాళ్లకేం ఎన్ని ఉపన్యాసాలయినా యిస్తారు! వేళకి కావలసిన తిండీ గుడ్డా అమరి పోతూ ఉంటే వినేవాళ్లుండాలి గాని వాళ్ల కబుర్లకేం కరువు,

నర్సింగ్ హోం చేరుకుంటున్న కొద్దీ శకుంతల గుండె వేగంగా కొట్టుకోజొచ్చింది. ముందురోజు సాయంత్రం నుంచీ ఆ రోజు సాయంత్రం వరకూ— ఇందిరా, శ్రీధర్, వాళ్ల యిల్లూ... ఇవన్నీ తనదుఃఖం నుంచి తనని తాత్కాలికంగానైనా వేరు చేసి ఉపశాంతి కలిగించాయి. ఏ కోరికా తీరని ఎడారి లాంటి జీవితంలో వడగాడుపు లాంటి ఈ కుదరని రోగం ఒకటి! దాన్తోపాటు తప్పుచేశానేమో అనే భావన ఒకటి ఆమెని క్రుంగదీయ సాగింది. ఎప్పుడో ఒంటిగంటకి యిచ్చిన కాఫీ. పొద్దుట సరిగ్గా ఆ దెబ్బదగ్గిర కెలికి ఏవో లోషన్లు వేసికడిగి కట్టు కట్టేరు. ఎంతో ఓర్పుగల మనిషయినా భరించలేక గిలగిల లాడిపోయాడు. ఇంతలావున వాచిపోయింది. పాపం ఇప్పుడెలా ఉందో...కాస్త దూరాన ఉన్న వస్తువు వెళ్లి తీసుకోలేని దుస్థితి. ఇంకా తన ఊరినుంచి సాయంగా ఉంటుందని పైడమ్మని తీసుకొచ్చిందిగాని...

ఆమె హడలిపోతున్నట్టే అతను ఒక్కడే ఉన్నాడు.

'ఎలా ఉంది సలుపు? పైడమ్మ ఏదీ?'

"ఇంతసేపూ ఉంది. 'మాయాబజారు' సినిమా వచ్చిందని తెలిసి నేనే దెబ్బలాడి పంపించాను. పిచ్చిముండ, ఓపట్నాన వెళ్లదే! ముసిల్ది యింకా ఎన్నాళ్లు నిలుస్తుంది ఆ చూపు! ఇలా దగ్గిరగావచ్చి కూచో... అలా ఉందేం మొహం! విూ ఫ్రెండు యిల్లు సులువుగా తెలిసిందా? ఇంకోగడీ ఉండి రాకపోయావా... ఏ బీచ్‌కయినా వెళ్లకపోయారా? సరేలే లేచి మొహం కడుక్కో...పైడమ్మ చేత కాఫీ తెప్పించాను. ఫ్లాస్కులో ఉంది. తాగుదువుగాని..."

అన్నీ మరచిపోయి, బుగ్గన చెయ్యి పెట్టుకుని అలా మొగుణ్ణి చూస్తూ కూచుండిపోయింది శకుంతల.

ఇన్నేళ్ల తన కాపరంలో, ఎదుటివాళ్లని యిబ్బంది పెట్టే ఒక్క కోపరేఖ చూడలేదు. ఆ మొహంలో... ఆస్తి లేదు, ఆరోగ్యంలేదు, అందానికి ఆస్కారంలేదు ... ఎప్పటికైనా యీ స్థితి బాగుపడుతుందనే భరోసాలేదు... అయితేనేం!

ఎన్నికలలయితేనేం, కన్నీటి చుక్కలా కరిగిపోయేది ఆడదాని బతుకు. అది ఏడు రంగుల మాలికగా ఒక్క క్షణమైనా ఒళ్ళు విరుచుకోవాలంటే కట్టుకున్నవాడి కరుణ కిరణం ఒకటే, ఒక్కటంటే ఒకటి చాలు! చాలదా?

'శకుంతలా!' మొగుడి పిలుపుతో త్రుళ్లిపడి లేచింది ఆమె.

'లే,లే, మొహం కడుక్కుని కాఫీ తాగు... సీసా పట్టుకుని తొందరగా బూత్ దగ్గిర కెళ్లు. లేకపోతే పాలు దొరకవ్. వచ్చేటప్పుడు, యిదిగో చీటీ. డాక్టరుగారు ఏదో ఆయింట్‌మెంట్ రాసిచ్చారు తీసుకురా... అన్నట్టు అన్నయ్యకీ, అమ్మకీ ఉత్తరాలు రాసి ఉంచాను. టైమయిపోయింది. హెడ్ పోస్టాఫీస్‌లో పడేసిరావాలి. తొందరగా డబ్బు రాకపోతే ఇబ్బంది పడిపోతాం.'

'నీలాంటివాణ్ణి కట్టుకున్నాక నాకు యికయిబ్బందికాక మిగిలిందేమిటి!' అన్నట్టు మూతి విరిచి, శకుంతల సబ్బూ, తువ్వాలూ తీసుకోడానికి లేచింది.

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక
**ఆంధ్రపత్రిక**
ఇప్పుడు ఎన్నో సరికొత్త
శీర్షికలతో వెలువడుతోంది!
నెల చందా : 7-50
పోస్టుద్వారా : 8-10